# "మాకంటె పసురాలే నయ్యం"

బస్టాండులున్న సెట్టుకింద కూసున్న. నన్ను సూసి అల్లోగలీల్లోగలచ్చి దగ్గెర గూసున్నరు. ఇగ బైసు మొదలైంది. మా మాటలల్ల అమెరిక ప్రెసిడెంటు కాన్నుంచి అమాలోన్దాకత్తండ్రు. దునియంత తిరిగి ఆఖరుకు నగుసులైట్ల దగ్గెరచ్చాగింది బైసు.

"గా ఊల్లె పోలీసోల్లు దాడిచేసి ఇంటికొగన్ని పట్టుకపెయింద్రట. ముసలోల్లను గూడ ఇడ్సిపెట్టకుంట మస్తు తన్నింద్రట".

"గీ పోరగాండ్లు సెయ్యవట్టి అవ్వయ్యలకచ్చింది సావు........!"

"గవిరిమెంటోల్ల గురించి మస్తు కఠినంగుంది. ఒక్కొక్కలనే పారేత్తండ్రు. ఆల్లపేరే లేకుంట జేత్తరిగ"

"గీ గవిర్నమెంటుది గూడ తప్పుడు పాల్సే. వాళ్ళు గట్ల మారుటానికున్న కారణాలను తెలుసుకొని గవ్విట్ని సక్కజెయ్యాలె కని గాల్ల నేరేసుకపోతెమత్తది? ఆడుపోతె ఇంకొగడత్తడు. ఊళ్లున్న పెత్తందార్ల జబర్దస్తి, దోపిడి నగుసులైట్లం తయారుచేసింది. గదాన్ని నిర్మూలించాలె"

గీ మాటలన్ని ఇంటుంటె నేను సిన్నప్పుడు సూసిన సంగతోటి యాదికచ్చింది. గిసోంటి యెన్నో మాట్ల జూసినా గది నా మెదట్ల అట్లనే నిల్సిపెయింది. గా సంగతి సెప్పిన నా సోపతికాల్లతోని......

మా బడికి చుట్టయింది. వయిలు చేతుల వట్టుకోని పగటిబువ్వ తినచ్చుటానికి ఇంటికి పోతన్న. అటీటు సూసుకుంట నడుత్తన్న. మొసకొట్టుకుంట. ఎగపోసుకుంటత్తంది తీగల లింగవ్వ. నా ముందటికెల్లే దవ్వదవ్వ పొయ్యి బాయికాడికి పెయింది. జెప్పజెప్పనో బొక్కెడన్ని నీల్లు సేదుకుంది. కాల్లు సేతులు కడుక్కుంది. రొమ్ములందీసి నీల్లతోని తుడ్సింది. అరుగుమీనున్న మంచం దగ్గెరి కురికచ్చింది. మంచంలున్న పోల్గికే పొల్లగాన్నొకుంచుటానికి కిందుమీదయితందెడ పొల్ల. నేనట్లనే బజార్ల నిల్సుండి సూత్తు. అరుక్కున్ను బజారుకు రొండు మూడు గజాల దూరమే ఉంది.

"జో.....జో....అచ్చీ........అచ్చీ.....దాయెదాయె పిట్టా దయే గల్ల పిట్టా......." అని పాటపాడుకుంట

ఏడ్సుకుంటున్న పొల్లగాన్నూకుంచుటానికి కోశిశ్ సేత్తున్న ఆరేండ్ల పిల్లను లెమ్మని ముందల కూసుంది లింగవ్వ. పిల్లగాన్ని తీసుకోని రొమ్ము నోట్లె పెట్టింది. ఏడ్సుడు బందుజేసిండు పిల్లగాడు. మల్ల పోవుటాని కేగిరపడుతందామె. ఆమె గట్లెక్కన్నుచురుక్కుంటచ్చిందో, ఏడికి పోవుటానికేగిర్తపడ్తందో నాకరుతం గాలే. అయినా గని 'ఆమేం జేత్తదో' అని అట్లనే సూసుకుంట నిల్సున్న. కొంచెమంతోసేపు పాలు వట్టంగనే ఆ పిల్లగాడు నిదురవెయిండు.

"ఇగ నేంబోత బిడ్డ. తమ్మున్ని మంచిగ జూసుకో. లేసి ఏడిత్తె ఎత్తుకోని అటీటు తిప్పు. నేనచ్చేవారకు పొద్దు గూకుద్ది" అంది లింగవ్వ.

"నీ యవ్వ నేనూకుంచ పో. కొద్దిగాగి పోతేంది? గిప్పుడే అత్తివి ఉరుకుతననవడ్తివి. నేనూకుంచుతె ఊకుంటలేడు" అంది లింగవ్వ బిడ్డ.

"ఇక్కడ కూసుంటె కయికిలిచ్చెటోడూకుంటడా బిడ్డ? సూసుసేతల్ల పొద్దిరిగుంజలు దాటుతన్నయి. పాలియ్యాల్లయిపెయింది.[68] ఆల్చెమైతె పటేల్దిడుతడు. ఇంక గిప్ప కొంచెం నయ్యం. ఎలుమదొరలయితె పాలియ్యగూడ పోనియ్యరు. పోనిచ్చినా బూమ్మీద ఉంచి తడారకముందు రమ్మంటరు. గట్లుంటది బిడ్డ". గా పసిపొల్ల కరుతం గాకున్నా సెప్పుకుంట లేసింది.

"నీ యవ్వ! గీ కయికిలి పాడుగాను. సెయ్యకుంటేంది? తమ్ముడూకుంటలేడు. లేత్తె బాగేడుత్తడిగ".

"గీ పని జెయ్యకుంటె నోట్లెకు బువ్వెట్లత్తదే బిడ్డ? మనమేమన్న నోసుకపుట్టినామె? మనసోంటోల్ల యట్టిబట్టు రాతలు కైకిలి దొరికిన్నాడు తినాలె. లేన్నాడు పండాలె. మనకున్న పసురాలకేం తేడలేదు. గా పసురాలు ముల్లుగట్టెవట్టి కొడుతంటె ఎనుకెనుకకు నడ్సుకుంట మోటిగ్గుతయి. మనసోంటోల్లం గట్లనే ఎనుకెనుకకు నడ్సుకుంట నాటెయ్యాలె. ఏది సెప్పుతె గది జెయ్యాలె. గిన్ని సేసినా కని కడుపునిండ బువ్వ దొరుకుడు కట్టమే. నేను బుక్కెడంత బువ్వదిని పోత. తమ్మున్ని మంచిగ సూసుకో. కుక్క గిట్ట తమ్ముందగ్గెరకు రాజక్క" అని ఇంట్లకు పెయింది లింగవ్వ.

నేనక్కన్నుంచి కదిలి ఇంటిమొకాన నడుత్తన్న. నేనింటికి సేరకముందే నన్ను దాటేసుకుంట గబ్బగబ్బ నడ్సిపోయింది లింగవ్వ. గా ముత్తెమంత సేపట్ల బువ్వెప్పుడు తిన్నదో నాకయితె తెలువలే. నేను జెప్పిందిన్నరక్కడున్నోల్లు.........

"గిసోంటియి మన తెలంగాణల ఊరూరికి జరుగుతయి. పగటీలి పిల్లతల్లి పాలిచ్చుటానికి

పోవుడు గూడ కట్టమేనాయె. నేను విన్న సంగతోటి సెప్పుతన్న వినుండ్రి. ఎలుమదాంకు కయికిలి పెయినొకామెకు పాలు సెపులత్తన్నయి. రొమ్ములు జలుపుతన్నయి. జెప్పున పొయ్యి పాల్లకు పాలిచ్చత్తనని. ఇక్కడున్నట్టే ఉరికత్తనని అన్నదామె. దొరామెను జూసి ఇకిలిచ్చి పడ్డన్నడు. పాలతోనామె రైకంత తడ్సింది. జలుపుతున్న పొయ్యత్తనన్నాగని దొరిన్లే. మల్లమల్లడిగెవారకిగ మస్తు కోపానికచ్చిండు. పాలు గంతగనంసేపు లత్తన్నాయె. బాగ తింటెపాలు బాగ పడ్డట్టున్నయి. అయితే పిండి పారేత్తపట్టు అని అందరు మిలమిల సూడంగ పాలు పిండిండు దొర. ఆడెంత పసురమో సూడుండ్రి. గసోంటోన్ని కోనాయె అనెటోడు లేపాయె. గింత పీడనుండె ఊల్లల్ల. గాల్లనెదిరిచ్చెటోల్లచ్చెవారకు సహజంగనే సాయంజేసిండ్రు" అని తనకు తెల్సింది సెప్పిండు.

"గా జెగిత్యాల దిక్కు ఎలుమోల్లదయితె ఇగ వశెంగాని రాజ్జెం. ఏ దొర ఎంతమందాడోల్లను అనబగిత్తె గంత గొప్పానికింద లెక్క. ఊల్లల్ల అల్ల కంట్లెపడ్డ ఆడిదాన్నిడిసి పెట్టకపోదురు. పెద్దమనిసయినాడిది కొన్నాల్లల్ల నయితె మొదాలు మొగనిదగ్గెరికి పోకముందే దొర దగ్గెరికి పోవాలె. గింత సాగిచ్చుకున్నరాల్లు. గరీబోల్ల మీనాల్ల జులుంకు లెక్కేలేదు. ఒక్కొక్క లింట్లల్ల ఎట్టితోనే సచ్చెదాక బతికింద్రు కొందరు. అల్ల బతుకులు పసురాల బతుకులకంటె ఈనంగుండె. ఓ పారాపారి పసురాలన్న కోపమత్తె కొమ్ములాడిచ్చెటియి గని అల్లకు గా ససంత్రమన్న లేదు. గింత పీడనుండె పటికెనే తెలంగాణల గంత నగుసలైట్లు తయ్యారయ్యింద్రు".

"పిల్లనైన గని అర్రలేసి కొడుతంటె ఓపారి మర్లవడ్తది. గట్లనే కడుపుల కాలినోడు దొరల పెద్దిరుకం, జెబర్దస్తి వశెంగాక గండ్ల కల్సిండు. ఊల్లన్ని అగ్నిగుండాలోలయినయి. కని ఎంతమందినని సంపుడ్తి గవుర్నమెంటు. గాల్లు గట్లెందుకైంద్రో తెలుసుకొని గా పరిస్థితుల్లేకుంట సేత్తె అల్లే మారిపోతరు" అన్నడో సోపతికాడు.

"గిట్ల మనం బజార్ల బయిరంగంగ మాట్లాడుతె మనల్ని లోపలేసినా ఏత్తరు. ఈల్లు మాత్తురం తక్కో ఉన్నరా? మనుషులన్నరుకుడేనాయె. గీ మాటలకంతేడుంది పటు? ఏదేమైనా ఒగనికి నూరెకురాలుంటె ఇంకొగనికి ఒక్కెకురమన్న లేపాయె. ఒగనికి లక్షలుంటె ఇంకొగనికి తిండికే లేపాయె. గీ అంతురాలను తగ్గిత్తె గిసోంటాటికి కొంతైన పరిష్కారం దొరుకుద్ది" అని లేసిండు ఇంకో సోపతికాడు.

అందరం లేసి ఎటోల్లమటు పెయినం.

సోపతికాడన్న ఆకరు మాటలు నాకెప్పుడు యాదికత్తనే ఉంటయి. గీ తెలంగాణలనే గిట్లెందుకుంది? ఆంధ్రల లేదా? అని బాగాలోసిత్తె ఎక్కడుండే దక్కడున్నదనిపిత్తది నాకు. అయితే తెలంగానలున్న సంగతులు వేరుగున్నట్లనిపిత్తది. గందుకే గీ పోరటాలు గిక్కడే మొదలైనయనుకుంటే.